# మనోవేదన

శ్రీమతి అయ్యగారి రాఘవమ్మ

ఆ నాడు నరసింహానికి జ్వరంతగిలింది. వాడి శరీరము కణకణ కాగి పోతూంది. వంటిమీద చేయివేసి హడలిపోతున్నారు చూచినవాళ్ళు.

వాళ్ళ నాన్నవచ్చి, "ఎలా ఉందయ్యా! నీ వంట్లో" అని చాలా ఆతృతగా అడిగాడు.

వాడు మెల్లిగా కళ్లువిప్పి, "నాన్నా! నాకు పలక పుస్తకం కొనివ్వవూ! నేను చదువుకుంటాను," అన్నాడు.

తండ్రి నోటివెంట జవాబురాకుండానే వాడు మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు.

అయ్యో! వాడడగగానే, కొనైనా యిచ్చేస్తే వాడికీ జ్వరం రాకపోనేమో! అని అనుకుంటూ, ఆయన అక్కే నిలబడినాడు.

మళ్లీ "నాన్నా పుస్తకం పలక కొనివ్వవూ! జాగ్రత్తగా చదువుకుంటాను" అని మళ్లీ పలకరించాడా కుర్రాడు.

తండ్రి గ్రుడ్లవెంట నీరు తిరిగింది. "అలాగేరా నాయనా! తప్పకుండా కొనిస్తాను. జ్వరం తగ్గనీ" మళ్ళీ కళ్ళు మూసుకు పడుకున్నాడు ఆ కుర్రాడు.

వాళ్ల యింట్లో ఆ పిల్లాడు రెండోవాడు. ఆ తల్లి తండ్రులకు చాలమంది పిల్లలుపోయి, చాలా రోజులకి కుర్రాళ్లు బ్రతికారు. అందుచే, వాళ్లకా యింట్లో చాలా గౌరవ ప్రేమలు లభించేవి.

నరసింహానికి ఐదు సంవత్సరాల వయస్సున అందరి పిల్లలాగే, బళ్లోకి పంపించారు. వాడు కొంచెం సుకుమారంగల శరీరంగలవాడు. భోజనంలో లోపం వచ్చినా నేలమీద పడుకొనినా, సహించలేకపోయేవాడు. ఏమాత్రం తేడావచ్చినా, వాడికి జ్వరం తగిలేది. వాడు బ్రతికి సంతోషంగా ఉంటేనే చాలునని, ఎప్పటికో చదువుకుంటాడని, వాడి తల్లి తండ్రులు భావించేవారు. అందుచే వాడి చదువుకూడ వానాకాలపు ముసురులాగయింది.

మామూలుగా తోటి పిల్లలతో స్కూలుకు వెళ్లి, ఇంటికి వచ్చేవాడా కుర్రాడు. కాని, వాడెంతవరకు చదివాడో, వాడికెంతవరకు వచ్చిందో ఎవరు కనుక్కో లేదు. కనుక్కో ప్రయత్నించనూ లేదు.

తండ్రిగారి గౌరవాన్నిబట్టి స్కూలులో గూడ వాడిననేవారుకూడ లేరు. ఉపాధ్యాయులుకూడ వాడిపట్ల ముభావంగా చదివినా చదువకపోయినా ఊరుకొనేవారు. ఇలా గడిచిపోయింది వాడికా స్కూలు ప్రాథమిక విద్యాభ్యాస మొదటి

దినాలలో.

ఒకనాడు నరసింహాం స్కూలునుండి యింటికి వస్తున్నాడు. పిల్లలందరు ఇంటికి పోదామనే తొందరకొద్దీ ఒకరి నొకరు త్రోసుకొని తొందరగా వచ్చేస్తున్నారు. ఈ సందట్లో వాడిచేయిజారి పుస్తకం క్రింద పడిపోయింది. వాడి పుస్తకం అదివరకే పాతబడి చిరిగిపోయింది.

ఇంటికి వచ్చాడు. వాళ్లమ్మతో చెప్పాడు. తన పలక పగిలిపోయిందనీ, పుస్తకం చిరిగిపోయిందనీ.

"బడిలోజేరి పట్టుమని పది నెలలైనా గడవలేదు; అప్పుడే అయ్యో పలకలకు పుస్తకాలకీ అంతులేదు" అని కసిరింది వాళ్లమ్మ.

"ఈ వెధవకింకా చదువుకూడ ఎందుకూ! ఏదేనా అంటే ఏడుస్తాడు. ఒక్క అక్షర మేనా వ్రాయడు. ఎందుకు వీడికి చదువూ! పలకలేదు - పుల్లలేదు మూల కూచో వెధవా" అని నాలుగు తిట్టాడు వాళ్ల నాన్న.

నరసింహానికి గ్రుడ్లనీళ్లు తిరిగాయి. "అమ్మా! పదినెలలున్నాయిగాదే! ఇంకా ఎన్నాళ్లుంటాయి" అన్నాడు జాలిగా, వాళ్లనాన్న వెళ్ళిపోయాక వాళ్లమ్మతో.

ఆ కోపంలోకూడ, ఆ మాట కామెకు చిన్న నవ్వొచ్చింది. కాని మళ్లీ కొని యిస్తాననిగాని, ఆమె వానితో నన లేదు మరి కసరనూలేదు. క్రమంగా రెండు, మూడు వారం రోజులుకూడ గడిచాయి. పాపం! ఆ చిన్ని పిల్లాడు, అమాయకంగా అడిగేవాడు వాళ్లమ్మని "అమ్మా! పిల్ల లందరూ మంచి పలకలూ పుస్తకాలు తెచ్చుకొంటున్నారమ్మా! నాకు కూడ కొనిపెట్టవూ" అని "ఆదివారంనాడు వెళ్లి కొని తెచ్చు కొందువుగాని నాయనా!" అనేదితల్లి.

ఎన్ని ఆదివారాలో గడిచాయి. అలా అని ఎప్పటికప్పుడు తనని ఓదార్చుటేగాని, తన నెప్పుడూ కొనుక్కోమని వాడిని, వాళ్లమ్మ అన్న పాపాన పోలేదు. వాళ్ల నాన్న కావిషయమే పట్టలేదు వాడికి వాళ్లనాన్న నడగడానికి ధైర్యంలేదు.

ఇలా ఎన్ని వారాలో గడిచాయి. వాడికి నిరాశ నిస్పృహ కలిగింది. కాని అడగడం మాత్రం మానలేదు వాళ్లమ్మని.

చివరకోనాడు హఠాత్తుగా వాడికి జ్వరం తగిలింది. అది శ్రావణమాసా రంభం. ఆ వేళ వర్షం మెండుగా కురి సింది. ఆ చిన్న చిన్న చినుకుల్లో వాడ లానే బడినుండి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చేటప్పటికి తల, కొంతవరకు బట్టలు కూడ తడిశాయి. మరో గంటకు విపరీత మైన జ్వరం వచ్చింది.

చుట్టుపట్ల వాళ్లన్నారు "చిన్నపిల్లా మ్మా! చితపత చినుకుల్లో తడిసి

ఇంటికి వచ్చాడు. జలుబుచేసింది. మిరియాల కషాయం కొంచెం యివ్వండి. రేపటికి పోతుంది.''

వాళ్లుకూడ అలాగే అనుకొన్నారు. కాని, మరునాటికి ఇంకా ఎక్కువైనదా జ్వరం. కొంచెం పేలాపనకూడ వచ్చింది. ఏదో మందు డాక్టరిచ్చుచున్నాడేగాని రోగలక్షణాలేమీ మళ్లలేదు.

చూచుటకు వచ్చిన వాళ్లందరూ లోకమాట అనేవారు. ''భయపడినాడేమోనమ్మా పిల్లాడు. అమ్మవారి గుళ్లో కొంచెం విభూతైనా తెచ్చి పెట్టండి.''

ఎవరేది చెప్పితే; అవి, చాలా చేశారు. కానిరోజుకు రోజు ఎక్కువగుటయే కాని, తగ్గుముఖమేమీలేదు. తండ్రి ముఖంలోగూడ విషాదచ్ఛాయలు గోచరించాయి. అహర్నిశాలు, తల్లి తండ్రులు వాడి మంచం దగ్గరేయుండి, ఏక్షణానికి, వాడికారోగ్యం వస్తుందా అని వెయ్యి దేవుళ్లకు మ్రొక్కుతున్నారు.

హఠాత్తుగా ఒక్కమారు కళ్లుతెరచి, వాడు ''నాన్నా! నాన్నా! పలక పుస్తకం కొనియ్యవూ! ఇంకెప్పుడూ పగలగొట్టుకోను నాన్నా! జాగ్రత్తగా చదువుకుంటాను.''

ఆతృతగా అన్నారాయన, ''నాన్నా! చూడు బాబా! నీకు తప్పకుండా రేపు సాయంకాలానికి పలకపుల్ల తెచ్చిస్తానయ్యా! చూడయ్యా! ఎలాఉంది నీ వంట్లో!''

కళ్లుతెరచి వెంటనే మళ్లీ అడిగాడు వాడు. ''నాన్నా! ఎప్పుడు తెచ్చిపెడతావు నాన్నా!''

కళ్లనీళ్ళు తిరిగాయి వాళ్ళమ్మకి. ''డబ్బులు నీ దగ్గరుంచుకో బాబా! వాడికది కొనిస్తేనేగాని వాడి జ్వరంపోదు.''

వెంటనే నాన్న అందుకొని ''బాబా! ఇవిగో నీదగ్గరే ఉంచుకో బాబా ఈ డబ్బులు, నీకు జ్వరం తగ్గగానే కొత్త పలక పుస్తకం కొనుక్కొని బడికి వెళ్లుదుగాని'' అని ఆ డబ్బులు వాడి జేబులో వేసారాయన.

పూర్తిగా కళ్లిప్పాడు నరసింహం. ఆ రోజు మొదలుకొని క్రమంగా జ్వరంతగ్గి కోలుకోసాగాడు కుర్రాడు. నెమ్మదిగా పథ్యం పెట్టారు.

అప్పుడు తెలిసికొన్నారు నరసింహం తల్లీ తండ్రీ ''పిల్లలకేదైనా కావాలన్నది యివ్వకపోతే అది వాళ్ల లేతహృదయాన్నెంతగానో కలచివేస్తుందనీ; అందుచే సదావాళ్ల మనోవికాసాన్ని వృద్ధిపొందించే పరికరాలని కూర్చడం తప్పక ప్రతి తలి తండ్రి విధిగా గుర్తించాలని!''